ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




జగిత్యాల జిల్లా వార్తలు

5★★

శుక్రవారం 24 మే 2024

రుణమాఫీకి కసరత్తు



- 2019 ఏప్రిల్ 1 నుంచి తీసుకున్న వారికి వర్తింపు
- గత యేడాది డిసెంబరు 10 వరకు కటాఫ్
- సమాచారం కోసం బ్యాంకర్లకు ఆదేశాలు
- అర్హత, మార్గదర్శకాలపై ఉత్కంఠ
- జిల్లాలో 1.60 లక్షల మంది రైతులు

జగిత్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): పంటరుణాల మాఫీపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ. 2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేని ఫెస్టోలో ప్రకటించింది. ఆ ఎన్నికల్లో గెలిచి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇక ఇటీవల జరిగిన పార్ల మెంట్ ఎన్నికల్లోనూ పంట రుణాల మాఫీపై సీఎం రేవంత్ రెడ్డి మరింత స్పష్టత ఇచ్చారు. ఆగస్టు 15 నాటికి మాఫీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. రుణ మాఫీ ఎప్పటి నుంచి ఎప్పటివరకు అనే అంశంపై స్పష్టత ఇచ్చింది. అంతేకాక నిర్దేశించిన కాలంలో పంట రుణాలను తీసుకున్న రైతుల సమాచారాన్ని తయారు చేయాలని బ్యాంకర్లకు దిశానిర్దేశం చేసిం ది. అయితే పంట రుణాల మాఫీలో లబ్ధిదారుల ఎంపికపై ప్రభుత్వం ఇంకా మార్గదర్శకాలు రూపొం దించ లేదు. వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో పంట రుణాల మాఫీ, తిరిగి కొత్త రుణాలు, పంటలు సాగు వంటి వాటిపై రైతులు ఆశల పల్లకీలో ఉన్నారు. జిల్లాలో ప్రతి ఏటా సుమారు 4.24 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. జగిత్యాలలో 1.60 లక్షల మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తుండగా వీరికి తోడు దాదాపు 60 వేల మంది కౌలు రైతులు కూడా ఉన్నారు.

వానాకాలం సీజన్‌లో 4.24 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లావ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా వానాకాలంలో పంటల సాగు అవుతుందన్న అంచనాను అధికారులు వేశారు. జిల్లాలో సుమారు 1.60 లక్షల మంది రైతులు న్నారు. జిల్లా వ్యాప్తంగా పంటలు సాధారణ సాగు విస్తీర్ణం 3,35,978 ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 4,24,425 ఎకరాలు సాగు చేస్తారని అంచనా వేశారు. మండలాల్లోని క్లస్టర్ల వారీగా సాగు విస్తీర్ణం అంచనాలను వ్యవసాయ అధికారులు రూపొందించారు. ఇందులో ప్రధానంగా వరి 3,05,000 ఎకరాలు, మొక్కజొన్న 41,000 ఎకరాలు, కందులు 2,500, పెసర్లు 150, ఇతర పప్పులు 675, సో యా చిక్కుడు 600, పత్తి 20,200, చెరుకు 1,200 ఎకరాలు, పసుపు 11,000, ఇతర పంటలు 42,100 ఎకరాల్లో సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు.

కటాఫ్ నిర్దేశించిన ప్రభుత్వం

పంటల రుణమాఫీ కాలాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. 2019 ఏప్రిల్ 1 నుంచి 2023 డిసెంబరు 10వ తేదీ వరకు తీసుకున్న రుణాలకు మాఫీ వర్తించేలా పీరియడ్‌ను గుర్తించింది. ఈ పీరియడ్‌లో తీసుకున్న రుణాలను మాఫీ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతులు ప్రతి ఏడాది తీసుకున్న రుణాలు రెన్యువల్ చేసుకుంటూ, కొత్త రుణాలు తీసుకున్నట్లు బ్యాంకు రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారు. బ్యాంకులు కూడా ఏటా వడ్డీలను జమ చేసుకోవడం, కొంత రుణాన్ని పెంచి ఇవ్వటం చేస్తున్నాయి. జిల్లాలో ప్రతి ఏటా వానాకాలం, యాసంగి పంట రుణాలుగా సుమారు రూ. 1500 కోట్ల వరకు ఇస్తుంటాయి. మొత్తంగా దాదాపు సుమారు రెండు లక్షల మంది రైతులు పంట రుణాలు పొందుతున్నారు.

బ్యాంకర్ల నుంచి వివరాల సేకరణ

నిర్దేశించిన కాలంలో రూ. 2 లక్షల వరకు పంట రుణాలు పొందిన రైతుల వివరాలు తయారు చేయాలని ప్రభుత్వం ఇటీవల బ్యాంకర్లను ఆదేశించింది. జిల్లాలో పంట రుణాలు ఇచ్చే బ్యాంకులు పదుల సంఖ్యలో ఉండగా, ఈ బ్యాంకుల బ్రాంచీల ద్వారా రైతులకు రుణాలు అందిస్తున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ), ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ తదితర బ్యాంకులు పంట రుణాలు ఇస్తున్నాయి. జిల్లాలో ఉన్న ఆయా బ్యాంకుల బ్రాంచీలు పంట రుణాల జాబితాలను తయారు చేస్తున్నాయి.

మార్గదర్శకాలు రూపొందించని ప్రభుత్వం

పంట రుణాల మాఫీపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చినప్పటికీ ఇంకా మార్గదర్శకాలు రూపొందించలేదు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసినప్పటికీ ఓట్ల లెక్కింపు పూర్తి కాకపోవడంతో ఎన్నికల కోడ్ కొనసాగుతున్న క్రమంలో మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉండదనే చర్చ జరుగుతోంది. రుణ మాఫీ వ్యవహారంలో ప్రభుత్వం అర్హతలు, మార్గదర్శకాలను రూపొందించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం రూ. లక్ష రుణ మాఫీ అమలు చేసిన పుడు కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తింప చేసే లా మార్గదర్శకాలు రూపొందించింది. ప్రస్తుత ప్రభు త్వం అర్హతలను వెల్లడించాల్సి ఉంది. దీంతో అర్హత లు, మార్గదర్శకాలపై రైతుల్లో ఉత్కంఠ నెలకొంది. కొందరు రైతులు బ్యాంకుల నుంచి రుణాలు పొంది, ప్రభుత్వాలు మాఫీ అనడంతో కనీసం రెన్యువల్ కూడా చేయించుకోకుండా తమకు మాఫీ వర్తిస్తుందని ఆశగా ఉన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉంటుందనే అంశంపై వ్యవసాయ, రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది

వాణి, జిల్లా వ్యవసాయ అధికారి, జగిత్యాల



పంట రుణాల మాఫీకి అవసరమైన కసరత్తులు జరుగుతున్నాయి. రుణమాఫీ కోసం పలు వివరాల ను సేకరిస్తున్నాము. ప్రభుత్వం నుంచి మార్గ దర్శకాలు రావాల్సి ఉంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణ యానికి అనుగుణంగా రుణమాఫీ అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాము.

వారి పరిస్థితి ఏంటి..

గత ప్రభుత్వం రూ. లక్ష లోపు పంట రుణాల మాఫీ పథకాన్ని అమలు చేసింది. 2014 ఏప్రిల్ 1 నుంచి 2018 డిసెంబరు 11 వరకు కుటుంబంలో ఒకరికి రూ. లక్ష లోపు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేసేలా మార్గదర్శకాలకు రూపొందించింది. ఆ సమయాన జిల్లాలో సుమారు రెండు లక్షలకు పైగా రైతులు రూ. కోట్లలో పంట రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు, ఈ మొత్తం రైతుల్లో అర్హులైన వారికి నాలుగు విడతలుగా రూ. 25 వేల నుంచి రూ. లక్ష వరకు తీసుకున్న వారికి మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో నాలుగు విడతల్లో పలువురు రైతులకు రుణ మాఫీ చేసింది. ఇంకా జిల్లాలో సుమారు లక్ష మందికి పైగా రైతులకు చెందిన రుణాలు మాఫీ జరగాల్సి ఉంది. ఈ ప్రక్రియలో అర్హులైన రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూసి పెద్ద సంఖ్యలో రెన్యువల్ కూడా చేసుకోలేదు. దీంతో ఆయా రైతులకు ప్రస్తుతం రుణమాఫీ ప్రక్రియ వర్తిస్తుందా, లేదా..? అనేది స్పష్టత రావాల్సి ఉంది.

తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు అధైర్య పడవద్దని, తడిసిన ప్రతి గింజను గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా గురువారం ఒక ప్రకటనలో రైతులకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. గత యాసంగి సీజన్‌లో ఈ సమయానికి 2,50,427 మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు చేశామని, ఈ యాసంగి సీజన్‌లో నేటి వరకు 3,60,547 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని ప్రకటనలో తెలిపారు. 48,529 మంది రైతులకు రూ. 598 కోట్ల ధాన్యం డబ్బులను ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. గత సంవత్సరంలో పోలిస్తే ఈ సంవత్సరం ఇప్పటి వరకు 1,10,100 టన్నుల ధాన్యం అధికంగా కొనుగోలు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రైతుల నుంచి సేకరించిన అంచనా ప్రకారం 90 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, రాష్ట్రంలో అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసిన జిల్లాల్లో జగిత్యాల జిల్లా రెండో స్థానంలో నిలుస్తోందన్నారు. వారం రోజుల కొనుగోళ్లను పరిశీలిస్తే రోజుకు 11,200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి ప్రతి రోజు మిల్లులకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 156 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. మిగితా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించామన్నారు. బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షం వల్ల పలు కొనుగోలు కేంద్రాల్లో సుమారు 15,799 క్వింటాళ్ల ధాన్యం తడిసిందని, తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లులకు తరలించామన్నారు. మిల్లులకు తరలించిన ధాన్యం బస్తాలను వెంటనే లారీల్లోనుంచి దింపుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని తరలించేందుకు తహసీల్దార్లు, పౌరసరఫరాల నాయబ్ తహసీల్దార్లు, సహాయక ప్రాజెక్టు మేనేజర్, కమ్యూనిటి కో-ఆర్డినేటర్, క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తడిసిన ధాన్యం బస్తాలను వెంటనే బాయిల్డ్ రైస్‌మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత లేకుండా సంబంధిత తహసీల్దార్లు, నాయబు తహసీల్దార్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు రాబోయే రోజుల్లో వర్ష సూచన ఉన్నందున రైతులు తమ ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరగా కొనుగోళ్లు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను, నిర్వాహకులను ఆదేశించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ధాన్యం త్వరగా తూకం వేయాలి



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాంబాబు

కొడిమ్యాల, మే 23: రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేయాలని అడిషనల్ కలెక్టర్ రాంబాబు ఆదేశించారు. గురువారం మండలంలోని నాచుపల్లి, గౌరాపూర్, గంగారాంతండా గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. రెండు మూడు రోజుల్లో కొనుగోళ్లను పూర్తి చేయాలని సంబందిత సిబ్బందిని ఆదేశించారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి జరిగిన పంట నష్టం గురించి తెలుసుకున్నారు. అంతేకాకుండా రైస్ మిల్లును సందర్శించి ధాన్యాన్ని వెంటనే దించుకొని కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట సివిల్ సప్లైస్ డీఎం హతీరాం, కొడిమ్యాల తహసీల్దార్ టి రాజమణి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వామి, ఆర్ఐ కరుణాకర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నమ్మకమైన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న డీఏవో వాణి

కొడిమ్యాల, మే 23: రైతులు విత్తనాలను నమ్మకమైన డీలర్ల వద్ద కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి. వాణి అన్నారు. గురువారం మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలో వానాకాలంలో ముందస్తుగా రైతులు విత్తనున్న పంటలపై అవగాహన కలిపించారు. పంట వేసె ముందు మట్టి నమూనాల సేకరణ, విత్తన శుద్దిలాంటి పలు అంశాలపై రైతులకు అవగాహన కలిపించారు. ప్రతి రైతు నకిలీ విత్తనాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వరి కొయ్యలను కాల్చకుండ భూమి లోనె కలియ దున్నాలని రైతులను కోరారు. అవగాహన కార్యక్రమంలో ఏవో పి. జ్యోతి, ఏఈవోలు మంజుల, శ్రీనివాస్, గ్రీష్మ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కొడిమ్యాల, మే 23: మండలంలోని పూడూర్ గ్రామంలో గురువారం సాయంత్రం బీరప్ప ఉత్సవాల్లో బాగంగా పోచమ్మ బోనాలను కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుమారు 200 మంది మహిళలు బోనం నెత్తిన పెట్టుకొని పోచమ్మ ఆలయానికి వెళ్లారు. యువకులు నృత్యాలు చేస్తూ డప్పుచప్పుళ్లతో ఆలయానికి వెళ్లారు. కార్యక్రమంలో కుర్మ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మల్యాల, మే 23: ట్రాఫిక్ నిబంధనలపై మల్యాలలో పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కుమారస్వామి సైబర్ నేరాలు, హెల్మెట్ వినియోగం, డయల్ 100, షీ టీం, సీసీ కెమెరాలపై వివరించారు. ప్రజలు పోలీస్ హెల్ప్‌లైన్ 1930 సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- అన్నిరకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలి - బోనస్ ఇచ్చేదాకా ప్రభుత్వంపై పోరాడుతాం - మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

కొడిమ్యాల, మే 23: వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. కొడిమ్యాల మండలంలోని పూడూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ మంత్రి దృష్టికి తీసుకవెళ్లారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. సన్న వడ్లకే కాంగ్రెస్ ప్రభుత్వవ బోనస్ ఇస్తామనడం సరికాదని అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోనస్ ఇచ్చేదాకా ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. జగిత్యాల జిల్లాలో ఈ యాసంగిలో మూడులక్షల 723 ఎకరాల్లో వరి పంటను వేశారన్నారు. ఇందులో 650 ఎకరాల్లో మాత్రమే సన్న వడ్లు వేశారన్నారు. రాష్ట్రంలో దొడ్డు వడ్లకు రూ.. 500 రూపాయల బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో అన్ని రకాల వడ్లకు బోనస్ ఇచ్చేదాక పోరాడుతామన్నారు. రైతులు అసెంబ్లీ నడుస్తున్నప్పుడు మీరు రావాలన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఆరు గ్యారంటీలను బాండ్ పేపర్లపై రాసిచ్చి మోసం చేసిందన్నారు. 40 రోజులుగా తాము ధాన్యాన్ని పోసినా కొనటం లేదని పలువురు రైతులు హరీష్‌రావు దృష్టికి తీసుకువచ్చారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం యాసంగీలో 67 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనలేదని, రైతులు వడ్లు బయట అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు. రైతు బంధు అడిగితే ఒక మంత్రి చెప్పుతో కట్టాలని, బోనస్ ఇవ్వాలని అడిగితే మరో మంత్రి మొరుగుతున్నారని రైతులను అవమానపరుస్తున్నారన్నారు. ప్రభుత్వం, మంత్రులు క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు జాప్యంపై అడిషనల్ కలెక్టర్‌తో మాట్లాడి కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. ఆయన వెంట మల్యాల జడ్పీటీసీ రామ్మోహన్‌రావు, మల్యాల మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు మల్లేశంముదిరాజు, తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సింగిల్ విండోల ఛైర్మనులు రాజేందర్, సాగర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, స్వామి, చాంద్‌పాషా, రమేష్, ఆదన్న, బీరయ్య, అబ్రహం, అక్బర్, మల్లయ్య, సాగర్‌రావు, తిరుపతిరెడ్డి, చంద్రమోహన్, గంగరాజం, వేణు, పలువురు రైతులు తదితరులు ఉన్నారు.

● మొక్కులు చెల్లించుకున్న హరీష్‌రావు

మల్యాల: సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి హరీష్‌రావు కొండగట్టు ఆంజనేయస్వామికి ముడుపు మొక్కు చెల్లించుకున్నారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు తన విజయం కోసం అంజన్న సన్నిధిలో ముడుపు కట్టిన హరీష్‌రావు బుధవారం రాత్రి కొండపైకి చేరుకొని బస చేశారు. గురువారం స్వామి వారి సన్నిధానంలో పూజలు నిర్వహించి ముడుపు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఉన్నారు.



కొండగట్టులో ముడుపుతో పూజలు చేస్తున్న హరీష్‌రావు

నేడు పాలిసెట్

- నిమిషం ఆలస్యమైన నో ఎంట్రీ

- జిల్లాలో 6 కేంద్రాలు...2,190 మంది విద్యార్థులు

జగిత్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే (పాలిసెట్-2024) ప్రవేశ పరీక్షను జగిత్యాలలో ఈనెల 24వ తేదీన నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 2,190 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరవుతున్నట్లు అధికారులు అంటున్నారు. దీనికి సంబంధించి స్టేట్ అబ్జర్వర్‌తో పాటు ఏడుగురు అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సమాయానికంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాలకు అనుమంతించబడదని అధికారులు ప్రకటించారు. ఓఎంఆర్ విధానంలో నిర్వహించే పాలిసెట్ పరీక్షకు బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్ మాత్రమే వాడాలని, ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడవని అధికారులు తెలిపారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు పాలిసెట్ ప్రవేక్ష పరీక్షను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అరిగెల అశోక్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ పడాల తిరుపతి, చీఫ్ సూపరింటెండెంట్లు సందీప్, కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా పోచమ్మ తీర్థాల వేడుకలు

జగిత్యాలరూరల్, మే 23: జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేట గ్రామంలో గురువారం మాలసంఘం ఆధ్వర్యంలో పోచమ్మతీర్థాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులో గల పోచమ్మదేవతకు నైవేద్యం సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో మాల సంఘసభ్యులు, యువకులు, మహిళలలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తిప్పన్నపేట మాల సంఘసభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా





కోరుట్ల, రాయికల్‌లో పాల్గొన్న భక్తులు

రాయికల్, మే 23: మండలంలోని ఇటిక్యాల సాయిబాబా ఆలయంలో గురువారం బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు శివ శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, సింగని నవీన్, సురకంటి నాగిరెడ్డి, కటికె రాజేశం, సామల్ల మధు, చిన్న లింబాద్రి గౌడ, నేరెళ్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● **కోరుట్ల:** బుద్ధ పౌర్ణమి వేడుకలు గురువారం పట్టణంలోని సాయిరాం దేవాలయంలో వైభవంగా జరిగాయి. దేవాలయంలో సాయిబాబకు ప్రత్యేక పూజలు నిర్వహించిన వేదపండితులు అర్చన అభిషేక కార్యాక్రమాలను జరిపారు. దేవాలయంలో ఉదయం ఐదు గంటల నుండి కాగడ హారతితో ప్రారంభమైన వేడుకలు విశేష అభిషేకం, అభిషేక హారతిలతో పాటు ప్రత్యేక పూజలను జరిపారు. అర్చన అభిషేకాలను నిర్వహించి మధ్యాహ్న హారతి, పల్లకి సేవ, చావడి ఉత్సవం, భజన కార్యక్రమాలను జరిపారు. దేవాలయ అభివృద్ధి కమిటి, దేవాలయ శాఖ అద్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించంగా అధిక సంఖ్యలో దంపతులు పూజలో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక పూజలలో భక్తులు విశేషంగా హాజరు కావడంతో దేవాలయ ఆవరణ భక్తులతో కిటకిటలాడాయి. నిర్వహకులు అన్నదాన కార్యక్ర మం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకొని అన్న ప్రసాదంను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ శాఖ అధికారులు, అభివృద్ధి కమిటి సభ్యులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

పెగడపల్లి, మే 23: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంటూ పోలీసులు ప్రచారం నిర్వహిస్తున్నారు. వేసవి కాలంలో తరచూ దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయని పేర్కొంటూ ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ ముద్రించిన దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను గురువారం పెగడపల్లి ఎస్ఐ రామకృష్ణ నేతృత్వంలో పోలీస్‌లు ఊరూరా పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ఆరు బయట నిద్రించేటపుడు, శుభకార్యాలకు పుణ్యక్షేత్రాలకు వెళ్లేటపుడు, ఊరికి వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు.

'ఉపాధి' పనుల్లో హాజరు శాతం పెంచాలి

పెగడపల్లి, మే 23: ఉపాధిహామీ పనుల్లో కూలీల హాజరు శాతం పెంచాలని జిల్లా గ్రామీణాభివృద్ధి ఏపీడీ మదన్‌మోహన్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకంపై పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బందితో ఏపీడీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరిని ఉపాధిహామీ పనులకు హాజరయ్యేలా ప్రోత్సహించాలని, వేసవి భత్యం తదితర అంశాలను వివరిస్తూ హాజరు శాతం పెంచాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఏపీవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సైదాపూర్, మే 23: సైదాపూర్ మండల కేంద్రం నుం చి ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. గురువా రం తెల్లవారు జామున పె ట్రోలింగ్ చేస్తున్న పోలీసుల ను చూసి వెంకటేశ్వ ర్లపల్లి గ్రామ శివారులో టీఎస్08 యూబీ 3009 నంబర్ గల ట్రాలీ వాహనాన్ని రోడ్డుపై వదిలి కొందరు వ్యక్తులు పరారయ్యారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయడంతో అందులో 26 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం కనిపించాయి. వాహనం నంబర్ ఆధారంగా విచారించగా చిగురుమామిడి మండలం బొమ్మన పల్లికి చెందిన వల్లెపు అనిల్, బత్తుల కుమార్ అనే వ్యక్తి వద్ద నుంచి బియ్యాన్ని బీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు తరలిస్తున్నట్లు తెలిసింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సైదాపూర్ ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు.



సైదాపూర్ పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారానికి
నలిమెల భాస్కర్ ఎంపిక

ఈ నెల 26న హైదరాబాద్‌లో ప్రదానం



కరీంనగర్ కల్చరల్, మే 23: ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్రపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 26న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, ఎన్‌టీ ఆర్ స్టేడియంలో జరిగే ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారానికి తెలుగు భాషా సాహిత్యంలో విశేష పరిశోధనకు జిల్లా కేంద్రానికి చెందిన బహుభాషా వేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ ఎంపికయ్యారు. ఈ మేరకు సమన్వయ కర్త ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, కార్యదర్శి డాక్టర్ అప్పం పాండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారం కింద 50 వేల రూపాయల నగదు బహు మతి అందించనున్నారు. ముఖ్య అతిథిగా పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నర సింహారెడ్డి, అతిథులుగా విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ వెలిచాల కొండలరావు, పాత్రికేయుడు కె రామచంద్ర మూర్తి, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి, పూర్వ సంస్కృత శాఖా ధ్యక్షుడు ఆచార్య ఎ రాములు, సాహితీ పరిశోధకుడు డాక్టర్ శ్రీరంగాచార్య, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాద కులు డాక్టర్ కె శ్రీనివాస్, ఆయుర్వేద వైద్య పరిశోధకుడు డాక్టర్ భాగవతం రామారావు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (యుఎస్ఏ) రవ్వా రమేశ్ హాజరుకానుండగా ప్రొఫెసర్ కె యాదగిరి అధ్యక్షత వహించనున్నారన్నారు. సుమారు 14 భాషల్లో ప్రావీణ్యం సాధించిన వ్యక్తిగా, విశ్రాంత తెలుగు అధ్యాపకులుగా, నిత్య పరిశోధకు లుగా ఉంటున్న కవి, రచయిత డాక్టర్ భాస్కర్‌కు ఈ పురస్కారానికి ఎం పిక కావడం పట్ల ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలియ జేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

సెలవులో రాజన్న ఆలయ ఈవో

ఇన్‌చార్జి ఈవోగా రామకృష్ణ



వేములవాడ టౌన్, మే 23 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈవో కృష్ణప్రసాద్ అనారోగ్యం కారణంగా 15 రోజులు సెలవులో వెళ్లారు. దేవాదాయ శాఖలో రీజనల్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో గురువారం రాజన్న ఆలయానికి వచ్చిన రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. అనంతరం రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నా రు. ఈ సందర్భంగా ఆలయ ఏఈవో ప్రతాప నవీన్ ప్రసాదం అందజేశారు. సూపరిం టెండెంట్‌లు సిరిగిరి శ్రీరాములు, నర్సయ్య, అశోక్ ఉన్నారు.

ఇన్‌చార్జి వీసీని కలిసిన ఎస్‌యూ అధికారులు



ఎస్‌యూ ఇన్‌చార్జి వీసీకి అభినందనలు తెలుపుతున్న యూనివర్సిటీ అధికారులు

గణేశ్‌నగర్,మే 23: శాతవాహన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన కె సురేంద్ర మోహన్‌ను గురువారం సచివాలయంలో రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్, ఫైనాన్స్ ఆఫీసర్ రవీందర్ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. సురేంద్ర మోహన్ ప్రస్తుతం రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ విభాగానికి కార్యదర్శిగా ఉన్నారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ అధికారులు ఇన్‌చార్జి వీసీతో పలు అంశాలపై చర్చించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా యూనిర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేయనున్నట్లు ఇన్‌చార్జి వీసీ సురేంద్ర మోహన్ తెలిపారని వారు తెలిపారు.

పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్,మే 23: శాతవాహన యూనివర్సిటీ బీఈడీ ఒకటవ సెమిస్టర్, ఎంఈడీ ఒకటవ, మూడో సెమిస్టర్, ఎల్.ఎల్.బి ఒకటో సెమిస్టర్‌లకు సంబం ధించిన పరీక్షల తేదీలను యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. దీనికి సంబంధించిన వివరాలు యూని వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.


షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం


రూ.5 లక్షల నష్టం

ఎల్లారెడ్డిపేట, మే 23:జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో గురువారం విద్యుత్ తీగలు చెట్ల కొమ్మలకు తాకడంతో ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో ఆ ప్రాంతంలోని సుమారు 30 ఇళ్లలోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. భారీ శబ్దంతో ఒక్క సారిగా మంటలు ఎగిసి పడడంతో ఇళ్లలోని టీవీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, ఫ్యాన్లు కాలిపోయాయి. సుమారు రూ.5లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తాకడంతో ఇళ్లలోని పరికరాలు కాలిపోయాయని పేర్కొన్నారు. చెట్ల కొమ్మలకు దగ్గరలో ఉన్న తీగలను సరి చేయాలని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తీగలను సరి చేయడంతోపాటు తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, మే 23: కరీంనగర్ కోర్టు సమీపంలోని లైఫ్‌లైన్ హాస్పిటల్‌లో బుధవారం అర్థరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆసుపత్రి ఎలివేషన్ బోర్డులో మంటలు అంటుకున్నాయని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. సమా చారం అందుకున్న వెంటనే ఫైరింజన్‌తో సహా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేసినట్లు తెలిపారు. స్వల్ప నష్టం వాటిల్లగా ఎవరికీ ప్రమాదం జరగలేదని తెలిపారు.


ఎలగందల్ కోట




కోటలో ఉన్న ఫిరంగి

'ఎలగందల్'కు ఆదరణ ఏదీ?

భగత్‌నగర్, మే 23: ఎలగందల్ కోట పర్యాటక శోభితం.. నిరాదరణకు గురవుతున్న కళాకట్టడం.. కాకతీయుల కళా చిహ్నంగా నిర్మితమైన కోట.. పంచరాజవంశీయుల పాలనలో విలసిల్లింది. అలనాటి జిల్లా కేంద్రం... నిజాం పరిపాలనలో ఎలగందల్ కోటలోనే ప్రధాన కార్యాలయం... పర్యాటకంగా ఎంతో విశిష్టత ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కళాచిహ్నం నిరాదరణకు గురవుతున్నది. కరీంనగర్ జిల్లా కేంద్రానికి ఆనుకుని మానేరు నది ఒడ్డున ఉన్న ఎలగందల్ గ్రామంలోని కోట చారిత్రాకంగా గుర్తింపు పొందింది. కాకతీయులు, కుతుబ్‌షాహీ వంశీయులు, మొఘల్ సామ్రాజ్యం, హైదరాబాద్ నిజాం, ఆసఫ్‌జాహీల పాలనలో విలసిల్లిన ఎలగందల్ కోటపై పట్టింపుకరువైంది. ఆంధ్రప్రదేశ్ సమైక్యరాష్ట్రంలో ఎలగందల్ కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు యాభై లక్షల రూపాయలు కేటాయించారు. సంవత్సరం పాటు పర్యాటక శాఖ వారు లైటింగ్ ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా లైటింగ్ సౌండ్ సిస్టం ఏర్పాటు చేయడంతో కొంత మేర పర్యాటకులు ఎలగందల్ కోటను వీక్షించేందుకు వందల సంఖ్యలో తరలి వచ్చేవారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పిడుగు పాటుకు ప్రొజెక్టర్‌లు చెడిపోయాయి.

పురాతన జ్ఞాపక చిహ్నాలు

ఎలగందల్ కోటలో పురాతన జ్ఞాపక చిహ్నాలు ఎన్నో ఉన్నాయి. కొండ శిఖరాన ఉన్న ఎత్తైన కోట, తూర్పు ద్వారానికి వెలుపల ఉన్న బృందావన సరస్సు 1774లో ఫాఫర్-ఉద్-దౌలా చేత నిర్మించబడినది. ముస్లిం సన్యాసులైన సయ్యద్ షాహ్, మునావర్ క్వాద్రి సాహెబ్, దులా షాహ్ సాహెబ్, సయ్యద్ మరూఫ్ సాహెబ్, షాహ్ తాలిబ్ బిస్మిల్లా సాహెద్ వాలి హైదర్ సాహెబ్ సమాధులు కదిలిస్తే కొండ మీద ఉన్న మినార్‌లు ఊగుతాయని నానుడి. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న మరో రెండు మినార్లు నిజాం రాజులు నిర్మించారు. ఈ మినార్లు ఎక్కడానికి లోపలి నుంచి మొట్లు ఉంటాయి. వీటితో పాటు ఎలగందల్‌కోట నుంచి మానకొండూర్ వరకు 9 కిలోమీటర్ల మేర రహస్య సొరంగ మార్గం ఉందని ఇప్పటికీ ప్రజలు నమ్ముతారు.

పర్యాటకులకు రక్షణ కరువు

ఎలగందల్ కోటను చూడడానికి నిత్యం పర్యాటకులు వస్తున్నా అధికారులు మాత్రం రక్షణ చర్యలు చేపట్టడంలో విఫమయ్యారనేది వాస్తవం. ఎలగందల్ కోటను చూడానికి లోపలికి వెళ్లిన వారు కోట పైన చిన్నా పెద్ద ఎవరికి ఇష్టం వచ్చినట్ల వారే తిరిగి రావాల్సిందే. కోట పైభాగంగా రక్షణ చర్యలు ఏం లేకపోవడం విమర్శలకు తావు ఇస్తున్నది. పర్యాటకుల రక్షణ కోసం కోటపై భాగంలో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

పంచరాజవంశీయుల పాలన

ఎలగందల్‌ను ప్రధాన కేంద్రంగా చేసుకుని ఐదుగురు రాజవంశీయులను ఎలగందల్ కోట నుంచి పాలన కొనసాగించారు. 1083-1323 సంవత్సరం మధ్య కాలంలో కాకతీయుల రాజవంశీయులు ఎలగందుల కోటను నిర్మించారని చరిత్ర పాటాలు చెబుతున్నారు. యోధులైన ముసు నూరి నాయక్, రాచర్ల పద్మనాయక్‌లు ఎలగందల్ కోటను దృఢంగా చేశారు. 16వ శతాబ్ధంలో కుతుబ్‌షాభి వంశస్తులు కోటను ఆక్రమించుకుని క్యుయినముల్‌ఉల్‌ను కమాండర్‌గా నియమించారు. అనంతరం మొఘల్ సామ్రాజ్యం ఆధీనంలోకి వెళ్లిపోయింది. ఆ తర్వాత హైదరాబాద్ నిజాం ఉల్‌ముల్క్ నిజాం ఉల్ ముల్క్ నిజాం ఆసఫ్జాహ్ 1724-1748 వరకు ముగ్రాబ్ హయాంలో అమీన్‌ఖాన్ ఎలగందల్‌కు ఖిలేదార్‌గా నియమించ బడ్డాడు. నవాబ్ సలాబత్ జంగ్ హయాంలో మిర్జా ఇబ్రహీం దంసా ఖిలేదార్ అయ్యాడు. సికందర్ ఝా 1803-1823 వరకు పాలించాడు. 1754 సంవత్సరంలో దంసా ఈ కోటను పునర్నిర్మాణం చేసినట్లు చరిత్ర చెబుతున్నాయి. బహదూర్‌ఖాన్, కరీముద్దీన్‌లు తరువాతి కాలంంలో ఖిలేదారులుగా పనిచేశారు. ఎలగందల్ ఖిలేదారుగా పనిచేసిన కరీముద్దీన్ పేరు మీదనే కరీంనగర్ మారినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. 1905 సంవత్సరంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఆరవ నిజాం మహబూబ్ అలీఖాన్ జిల్ల కేంద్రాన్ని ఎలగందల్ నుంచి కరీంనగర్ మార్చారు.


ఎలగందల్ కోట ముఖద్వారం

తెల్లకందుల.. వెలగందుల.. ఎలగందుల

పూర్వం ఈ ఊరి పేరు బహుధాన్యానగరం. కాకతీయుల కాలం నుంచి ఎలిగందులగా పిలువబడుతున్నది. ఎలగందుల గ్రామం చుట్టు ప్రాంతాల్లో ఎక్కువగా తెల్లకందులు పండేవని ప్రసిద్ధి. దీంతో ఈ గ్రామానికి రాను రాను తెల్లకందుల పోయి ఎలగందల గ్రామం పేరు స్థిరపడిందనే చరిత్ర నానుడిలో ఉంది. తెల్లకందుల అన్న పేరు చింతామణి చెరువు వద్ద ఉన్న శాసనంలో స్పష్టంగా చెక్కబడి ఉంది. కొంత మంది మొదటి వెలగందుల గ్రామంగా ఉన్న పేరుకాస్త ఎలగందులగా స్థిరపడిందని చెప్పుకుంటుంటారు.

శత్రు దుర్భేద్యమైన కోట


ఎలగందల్‌కోటను పాలించిన రాజులు శత్రు దుర్భేద్యంగా నిర్మించు కున్నారు. శత్రువుల బారి నుంచి కోటను, దాడుల నుంచి కాపాడుకోవ డానికి ఎలగందల్ పాలకులు కోట చుట్టు ఐదుమీటర్ల (16అడుగుల) వెడల్పు 4 మీటర్లు (13 అడుగులు) లోతుతో పెద్ద పెద్దకందకాలు కోట చుట్టూ తవ్వి కందుకంలో రక్షణ కోసం మొసళ్లను వదిలి రక్షణ పొందే వారని చరిత్ర చెబుతున్నది.

నైసర్గిక స్వరూపం

కరీంనగర్ జిల్లా కేంద్రానికి 10కిలో మీటర్ల దూరంలో ఉండి మానేరు నదీ తీరాన ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో జిల్లాల పునర్ వ్యవస్తీరణలో భాగంగా ఈ గ్రామం కరీంనగర్ మండలం నుంచి కొత్తపల్లి మండలంలోకి మార్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 997 ఇళ్లతో 3,937 జనాభా, 1,720 హెక్టార్లలో విస్తరించి ఉంది.

● కాకతీయుల కాలం నుంచి నిజాం రాజ వంశీయులు ఆసంజాహీ వంశీయుల వరకు ఎలగంగల్ కోట నిత్యం కళా వైభవాన్ని చాటినప్పటికీ నేడు కళా విహీనంగా తయారై నిరాదరణకు గురవుతున్నది. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎలగంగల్ కోట అభివృద్ధిపై దృష్టి సారించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నది.


మినార్



కోటిలింగాల గోదావరి వద్ద పారిశుధ్య లోపం

● పుష్కర ఘాట్లపై పేరుకు పోయిన చెత్త ● గోదావరిలో స్నానాలకు ఇబ్బంది పడుతున్న భక్తులు ● పట్టించుకోని అధికారులు


ఘాట్లపై భక్తులు వదిలి పెట్టిన దుస్తులు, వ్యర్థ పదార్థాలు

వెల్గటూర్, మే 23: ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాల వద్ద గోదావరి నదిలో పారిశుధ్యం లోపించింది. పుష్కర ఘాట్లపై ఎక్కడ చూసినా భక్తులు వదిలిన పాత బట్టలు, వ్యర్థ పదార్థాలు దర్శనమిస్తున్నాయి. దీనితో గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో గోదావరి కళకళలాడేది. అప్పుడు భక్తులు పుష్కర ఘాట్ల వద్ద స్నానాలు చేసేవారు. పాత బట్టలను గోదావరిలో వదిలి పెడితే తమకు ఉన్న దోషాలు పోతాయని నమ్మే భక్తులు తమ వద్ద ఉన్న పాత దుస్తులను గోదావరిలో వదిలి పెట్టారు. స్నానాలు చేయడానికి గోదావరిలో దిగిన భక్తులకు నీటిలో తేలిన పాత దుస్తులు తమకు తగిలే సరికి స్నానాలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం తీవ్రమైన ఎండలకు గోదావరి లో నీటి మట్టం తగ్గింది. ఈ క్రమంలో భక్తులు వదిలి పెట్టిన దుస్తులు, వ్యర్థ పదార్థాలు పుష్కర ఘాట్లపై దర్శనమిస్తున్నాయి.

వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని దూర ప్రాంతాల నుంచి పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు గోదావరిలో, పుష్కర ఘాట్లపై పడి ఉన్న చెత్తను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై మండి పడుతున్నారు. పుష్కర ఘాట్లపై పాత దుస్తులు ఎక్కడ పడితే అక్కడ పడి ఉండి పారి శుధ్యం లోపించినా పట్టించుకున్న నాథుడు లేడు. ఆలయ అధికారులు, పంచాయితీ అధికా రుల సమన్వయ లోపంతో పారిశుధ్యం ఎక్కడ వేసిన చెత్త అక్కడే అన్న చందంగా మారిం ది. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి గోదావరిలో తేలిన చెత్తతో పాటు పుష్కర ఘాట్లపై ఉన్న వ్యర్థ పదార్థాలను వెంటనే తొలగించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుధ్య చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. గోదావరిలో తేలిన చెత్తా చెదా రంపై ఆలయ ఈవో కాంతారెడ్డి, పంచాయితీ కార్యదర్శి కరుణాకర్ లను 'ఆంధ్రజ్యోతి' వివ రణ కోరగా రెండు, మూడు రోజుల్లోనే గోదావరి విపరీతంగా తగ్గడంతో భక్తులు వదిలి పెట్టిన వ్యర్థ పదార్థాలు తేలాయని వాటిని తొలగించడానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

రాష్ట్రంలోనే జిల్లాను ఆదర్శంగా నిలపాలి

ప్రజారోగ్య శాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్


మాట్లాడుతున్న రవీంద్రనాయక్

సిరిసిల్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై వైద్యాధికారులు పూర్తి అవగాహనతో ఉండాలని, ఫైర్ సేఫ్టీ, వేస్ట్ మేనేజ్‌మెంట్ అమలు పరచడంతో పాటు వాటి లక్ష్యాలను సాధించి రాష్ట్రంలోనే రాజన్న సిరిసిల్ల జిల్లాను ఆదర్శంగా నిలపాలని ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ దిశానిర్దేశం చేశారు. గురువారం జిల్లాలోని తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందిస్తున్న సేవలను ఆన్‌లైన్ ద్వారా రిపోర్డు చేయాలని తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉండాలన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ ఉంటుందని, దీనిపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రజిత, డీపీవో ఉమాదేవి, డాక్టర్ నయూంజాన్, ఏవో సీహెచ్ శ్రీనివాస్, రాజ్‌కుమార్, కార్తీక్, బాలయ్య, సురేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన నరసింహుడి ఆలయం


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, మే 23: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో గురువారం కిటకిటలాడాయి. వైశాఖ శుద్ధ పౌర్ణమి తోడుగా సెలవు దినాలు కావటంతో దూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు భక్తులు చేరుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టికెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, అర్చకులు పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తిగీతాలతో ప్రతి ధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఎండ తీవ్రతపై భక్తుల దాహార్తి తీర్చడం కోసం ఆలయం పక్కాన చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆలయ సూపరింటెండెం ట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణ దారుపాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ,బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదంలో ఒకరి రిమాండ్

వేములవాడ టౌన్, మే 23 : భూ వివాదంలో అల్వాల్‌కు చెందిన ఇనుగంటి శ్రావణ్ రావును రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గురువారం తెలిపారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం వివరాలు వెల్లడించారు. వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామానికి చెందిన కొంపల్లి విజయకు తనది కానిని భూమిని ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన మంత్రి రఘు రూ.20 లక్షలకు విక్రయించాడు. కొంత భూమిని మాత్రమే రిజిస్ట్రేషన్ చేశాడు. మిగతా భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా నక్సలైట్‌నని, డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయంలో గతంలోనే రఘుని రిమాండ్‌కు తరలించారు. ఇటీవల రఘుకు సహకారంగా అల్వాల్‌కు చెందిన ఇనుగంటి శ్రావణ్‌రావు మరో వ్యక్తి డబ్బుల విషయం మర్చిపోవాలని విజయను బెదిరింపులకు గురి చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో శ్రావణ్‌రావుపై కేసు నమోదు చేసి కోనరావుపేట మండల పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితులకు సహకరించిన పలువురిపై దర్యాప్తు కొనసాగుతోందని ఇనుగంటి శ్రావణ్‌రావు ద్వారా ఎవరైనా మోసపోతే పోలీసులను సంప్రదించాలని డీఎస్పీ సూచించారు.

నకిలీ డాక్యుమెంట్స్ వ్యవహారంలో మరొకరు

సిరిసిల్ల క్రైం: భూమి వ్యవహారంలో నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసానికి పాల్పడిన సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాగుల రాములును గురువారం రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లోని సర్వే నంబరు 960 బై బీలో 363 చదరపు గజాల భూమిని ఎల్లారెడ్డిపేటకు చెందిన ఉప్పుల నారాయణకు 10 సంవత్సరాల క్రితం రూ.3 లక్షలకు విక్రయించాడు.భూమికి హద్దులు చూపించకపోవడంతో అనుమానం వచ్చిన నారాయణ తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాడు. ఆ భూమి ప్రభుత్వానికి చెందినదిగా రికార్డు అయ్యిందని తేలింది. మోసపోయినట్లు తెలుసుకున్న నారాయణ సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రాములుపై చీటింగ్ కేసు నమోదు చేశామని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. రాములుపై ఇప్పటికే 20 కేసులు నమోదయ్యాయని, ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

కారు బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

శంకరపట్నం, మే 23: శంకరపట్నం మండలం ఆముదాపల్లి గ్రామంలో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఆముదాలపల్లికి చెందిన గురువారం పుట్టపాక సమ్మయ్య బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో సమ్మయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలట్ ఖాజాఖలీల్ ప్రథమ చికిత్స అందించి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య


తరుణ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 23 : ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో పనులు చేయకుండా తిరిగితే బతకడం ఎట్లా? అని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన యువకుడు న్యాలపల్లి తరుణ్ (22) గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని జ్యోతి- శ్రీనివాస్ నిరుపేద దంపతుల చిన్న కొడుకు తరుణ్. పదో తరగతి వరకు చదివి మధ్యలోనే మానేశాడు. గ్రామంలోని టీవీ కేబుల్ సెంటర్‌లో దినసరి కూలీగా పని చేసేవాడు. కొద్దిరోజులుగా ఆ పనికి వెళ్ల కుండా ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో కూలీ పనులు చేసినా పూట గడవడం గగనమవుతోందని, ఏదైనా పని చూసుకోవాలని తల్లి జ్యోతి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన తరుణ్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయాడని నిర్ధారించారు. మృతుడి తల్లి జ్యోతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం స్థానికులు విరాళాలు పోగు చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి

సుల్తానాబాద్, మే 23 : బావిలో పడిపోయిన మోటార్‌ను తీయడానికి ప్రయత్నించిన ఓ వ్యక్తి నీటిలో మునిగి చనిపోయాడు. సుల్తానాబాద్ పట్టణంలోని గడిమహల్‌కు ఖాజావలి ఇంటిలోని బావిలో మోటార్, పైపులు పడిపోయాయి. వాటిని తీయడం కోసం మండలంలోని కనుకులగాంధీనగర్ గ్రామానికి చెందిన కొండపలకల అలియాస్ గట్టు శంకర్(54) అనే వ్యక్తిని తీసుకువచ్చాడు. శంకర్ బావిలో దిగి ముందు ఒకసారి లోపలి నుంచి పైపులు తీసుకొచ్చి అందించాడు. రెండోసారి మోటార్ కోసం దిగిన శంకర్ తిరిగి పైకిరాలేదు. దాంతో ఆందోళన చెంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అలాగే పెద్దపెల్లి అగ్నిమాపక దళ సిబ్బందికి కూడా సమాచారం అందించడంతో వారు వచ్చి నిచ్చెన సాయంతో బావిలోంచి శంకర్ మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు.

పనికి తీసుకువచ్చిన వ్యక్తి ఇంటి ఎదుట ఆందోళన

బావిలో నుంచి మోటర్ కోసం గట్టు శంకర్‌ను తీసుకొనివచ్చిన ఖాజావాలి ఇంటి ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ కనుకుల గాంధీనగర్ నాయకులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రవణ్ కుమార్‌లు చేరుకుని తెలుసుకుని వారిని సముదాయించారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నిద్రలోనే మృత్యు ఒడికి..

ఇటుకబట్టీ షెడ్ వద్ద విద్యుదాఘాతంతో తల్లీకూతుళ్ల మృతి


బాబి బిందాని మృతదేహం


బేని బిందాని మృతదేహం

కరీంనగర్ క్రైం, మే 23 : పొద్దంతా ఇటుకబట్టీలో పనిచేసిన తల్లీబిడ్డలు అక్కడే యజమాని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్‌లో రాత్రి నిద్రిస్తుండగా విద్యుదాఘాతంతో దుర్మరణం చెందారు. కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామ పరిధిలో లక్ష్మి ఇటుకలబట్టీ వద్ద షెడ్‌లో నివాసం ఉంటున్న ఒడిస్సా రాష్ట్రం నవరంగపూర్ జిల్లా పక్కన్ గూడ గ్రామానికి చెందిన బేని బిందాని(36), బాబి బిందాని(18)లు విద్యుదాఘాతంతో గురువారం వేకువజామున నిద్రలోనే మృతి చెందారు.

ఒడిస్సాకు చెందిన విద్యాధర్ బిందానికి ఇద్దరు భార్యలుండగా పెద్ద భార్య బేని బిందాని, ఆమె కూతురు బాబి బిందాని, కొడుకు ధశరథ్ బిందానిలు కొంత కాలంగా లక్ష్మి ఇటుకల బట్టీలో పని చేస్తూ ముగ్గురు అక్కడే తాత్కాలిక షెడ్‌లో నివాసం ఉంటున్నారు. విద్యాధర్ బిందాని తన చిన్న భార్యతో కలిసి మరొక ఇటుకబట్టీలో పనిచేస్తూ మరోచోట ఉంటున్నాడు. బేని బిందాని, ఆమె కూతురు బాబి బిందాని, కొడుకు ధశరథ్‌బిందానిలు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇటుకబట్టీలో పనిచేసి అనంతరం వారి గదిలో భోజనం చేసి రాత్రి 9 గంటలకు నిద్రించారు. అర్ధరాత్రి తరువాత గాలివానకు గదిలోని విద్యుత్‌వైర్ తెగి గది ఇనుప తలుపుపై పడింది. తలుపునకు సమీపంలో నిద్రిస్తున్న బాబి బిందాని నిద్రలో ఇనుప తలుపునకు చేయి తాకగానే ఆమె విద్యుదాఘాతానికి గురికాగా, ఆమె పక్కనే నిద్రిస్తున్న తల్లి బేని బిందానికి కూడా విద్యుత్‌షాక్ తగిలింది. ఇద్దరూ నిద్రలోనే మృతి చెందారు. పక్కనే ఉన్న కొడుకు ధశరథ్ బిందానికి ఏమీ కాలేదు.

గురువారం వేకువ జామున ఇటుకబట్టీలో పనిచేసే తోటి కార్మికుడు జగన్నాధ్ బిందాని వారి గది వద్దకు వచ్చి పనికి వెళదామని తలు పుతట్టగా అతనికి విద్యుత్‌షాక్ తగిలింది. వెంటనే ఈ విషయాన్ని బేని బందాని భర్త విద్యాధర్ బిందానికి ఫోన్ చేసి తెలిపాడు. విద్యాధర్ బిందాని వచ్చిన తరువాత విద్యుత్ సరఫరా నిలిపివేసి గదిలోపలికి వెళ్లి చూడగా అప్పటికే తల్లీకూతుళ్లు మరణించి ఉన్నారు. బాబి బిందాని మోచేతి వద్ద విద్యుత్ షాక్‌తో కమిలి పోయిన గాయం ఉంది. అయితే బుధవారం అర్ధరాత్రి వీచిన గాలి వానకు విద్యుత్‌వైర్ తెగి ఇనుప తలుపుపై పడటంతో విద్యుత్ సరఫరా అయి ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

లారీ, కారు ఢీ

కొడుకు మృతి తండ్రికి తీవ్రగాయాలు


మహాజన్ సాయిఅక్షయ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం/ మెట్‌పల్లి రూరల్, మే 23: ఇబ్రహీం పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజేశ్వర్‌రావుపేట శివారులో గురువారం మేకువ జామున ఎదురు ఎదురుగా లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో కొడుకు మహాజన్ సాయిఅక్షయ్(19) మృతి చెందగా, తండ్రి మహాజన్ శివరామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన మహాజన్ సాయిఅక్షయ్ ఇటీవల ఇంటర్ మీడియట్ పూర్తి చేశాడు. కొడుకు ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌లోని కాలేజీల వివరాలను తెలుసుకోవడానికి తండ్రి మహాజన్ శివరామకృష్ణ తన కుమారుడితో కలిసి బుధవారం ఏపీ15టీకే5454 అనే నంబర్ గల కారులో వెళ్లి తిరిగి రాత్రి మెట్‌పల్లికి బయలు దేరారు.

ఈ క్రమంలో గురువారం మేకువ జామున బండలింగాపూర్ గ్రామ శివారులోని గండి హనుమాన్ ఆలయంలో సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో మహాజన్ సాయిఅక్షయ్ అక్కడికక్కడే మృతి చెందగా శివరామకృష్ణ రెండు కాళ్లు, చేయి విరిగి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వగా గాయాలపాలైన శివరామకృష్ణకు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆసపత్రికి తరలించారు. ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించినం దుకు ఆర్యవైశ్య ఆధ్వర్యంలో అవార్డు అందుకొని మంచి భవిష్యత్ ఉన్న సాయిఅక్షయ్ మృతి చెందడం, తండ్రి శివరామకృష్ణ తీవ్ర గాయాలపాలవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి

జమ్మికుంట రూరల్, మే 23: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన వేల్పుల శ్రీనివాస్ (43) అనే రైతు విద్యుదాఘాతానికి మృతి చెందాడు. బుధవారం అర్ధరాత్రి ఈదురుగాలులు వీచి వర్షం కురిసింది. శ్రీనివాస్ ఇంట్లో సర్వీస్ వైరు లూజు అయి కిందకు వేలాడింది. తెల్లవారు జామున సర్వీస్ వైరును కర్రతో సరిచేసే సమయంలో శ్రీనివాస్ విద్యుదాఘాతానికి గురై అక్కడికి అక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్ భార్య మల్లేశ్వరి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.


శ్రీనివాస్ మృతదేహం

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో



రహదారిపై బైఠాయించిన రైతులు

రాయికల్, మే 23: మండలంలోని రామాజీపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి నెల రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిచి మొలకలు వచ్చి నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం పండించిన పంట చేతికి వచ్చేసరికి కొనుగోలు జరుగక, వర్షాలకు తడిసి తాము నష్టపోతున్నామన్నారు. అధికారుల తీరును నిరసిస్తూ ధాన్యం కొనుగోళ్లను త్వరగా చేపట్టాలని నినాదాలు చేశారు. రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు, తహసీల్దార్ ఖయ్యూం సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ఎండపల్లి, మే 23: మండలంలోని పాతగూడూర్ గ్రామానికి చెందిన బోయిని మహేష్ ఏప్రిల్ 12న ద్విచక్ర వాహనంపై వెళుతుండగా జేబులో నుంచి మొబైల్ ఫోన్ పడిపోయింది. దీంతో అతడు వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోయిన ఫోన్‌ని పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా కనుగొని గురువారం బాధితుడికి అప్పజెప్పామని వెల్గటూర్ ఎస్ఐ ఉమా సాగర్ తెలిపాడు.

హనుమాన్ దీక్షాపరులకు అన్నదానం

కొడిమ్యాల, మే 23: మండలం కేంద్రంలోని వాగు ఒడ్డున గల శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం సుమారు 200 మంది హన్మాన్ దీక్షాపరులకు భక్తులు అన్నదానం నిర్వహించారు. ఉదయం నుండి స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. అంతక ముందు ఆలయంలో స్వామి వారికి ఆలయ పూజారి భాస్కర్‌ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల గ్రామ ప్రముఖులు, హన్మాన్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

చాంపియన్ షీల్డ్ అందుకున్న పూడూర్ వాసి

కొడిమ్యాల, మే 23: టాటా ఏఐజీ హెల్త్ ఇన్సూరెన్స్‌లో దేశంలోనె అత్యుత్తమ ప్రతిభ కనపరిచినందుకు చాంపియన్లకే చాంపియన్ షీల్డ్-2024ను ఈ నెల 18న కేరళలోని కోచ్చిన్ పట్టణంలో కంపెనీ సీఈవో నీలేష్‌గార్గ్ చేతుల మీదుగా మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన మరక శ్రీనివాస్ అందుకున్నారు. టాటా ఏఐజీ లోని 80కి పైగా ఉన్న విభాగాల్లోని విభాగానికి ఒక్కరి చొప్పున ఎంపిక జరుగుగా హెల్త్ ఇన్సూరెన్స్ విభాగంలో శ్రీనివాస్ చాంపియన్ షీల్డ్‌కు ఎంపికైనాడు. షీల్డ్ అందుకున్న శ్రీనివాస్‌ను కంపెనీ ఏజెన్సీ కంట్రీ హెడ్ ప్రతీక్‌గుప్తా, నేషనల్ హెడ్ నరేందర్‌నేగీ, సౌత్ ఇండియా హెడ్ రామక్రిష్ణారెడ్డి అభినందనలు తెలిపి ప్రశంసంచారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ షీల్డ్ ఎంపికకు సహకరించిన ఏఎస్ఎం రాజ్‌కుమార్, రీజినల్ హెడ్ వివేకానంద, కట్ట విద్యాసాగర్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలింపు



పాషిగామలో తూకం వేసిన ధాన్యాన్ని తరలిస్తున్న అధికారులు

వెల్గటూర్, మే 23: కలెక్టర్ ఆదేశాల మేరకు తిమ్మాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాషిగామ, స్తంభంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి గురువారం తూకం వేసి ఉన్న ధాన్యాన్ని అధికారులు మిల్లులకు తరలించారు. బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిచింది. దీనితో రైతులు ఆందోళన చెందవద్దనే ఉద్దేశంతో తూకం వేసి ఉన్న ధాన్యాన్ని ఎలాంటి కటింగ్ లేకుండా అధికారులు మిల్లుకు తరలించారు. దీనితో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పాషిగామ కొనుగోలు కేంద్రం నుంచి 1,929 బస్తాలు, స్తంభంపల్లి కొనుగోలు కేంద్రం నుంచి 1,365 బస్తాలు మిల్లులకు తరలించినట్లు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, తిమ్మాపూర్ సింగిల్ విండో సీఈవో ప్రభాకర్ తెలిపారు.

వడదెబ్బతో యువకుడి మృతి

- కుటుంబసభ్యులకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శ

బీర్‌పూర్, మే 23: బీర్‌పూర్ మండలంలోని చిత్రవేణిగూడెంకు చెందిన మేశ్రం సురేందర్ (37) అనే యువకుడు వడదెబ్బతో మృతి చెందాడు. సురేందర్ కుటుంబసభ్యులు మంగళవారం కులదేవత కొలుపు చేశారు. ఇంటి వద్ద వడదెబ్బకు గురికాగా కుటుంబసభ్యులు జగిత్యాలలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కాంగ్రెస్ కార్యకర్త అయిన సురేందర్ మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి తన సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైస్‌ఎంపీపీ లక్ష్మణ్‌రావు, ఉమ్మడి సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కన్వీనర్ జితేందర్ యాదవ్, నాయకులు మల్లారెడ్డి, భూమేష్ తదితరులు ఉన్నారు.

నేడు మల్యాల ఎంపీపీ ఎన్నిక

మల్యాల, మే 23: మల్యాల ఎంపీపీ ఎన్నికను శుక్రవారం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎంపీపీ పదవి కోసం మల్యాల-1 ఎంపీటీసీ ఆగంతపు రవళి, మ్యాడంపల్లి ఎంపీటీసీ ముదుగంటి వనిత పోటీపడుతుండడంతో గురువారం కొండగట్టులో ఎంపీటీసీల సమావేశం నిర్వహించారు. దీనికి తొమ్మిది మంది సభ్యులు హాజరు కాగ అవిశ్వాసం సందర్భంగా నిర్వహించిన క్యాంపుల నిర్వహణ ఖర్చులపై చర్చించుకున్నారు. శుక్రవారం ఎంపీపీ ఎవరనేది తేలనుంది.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏలేటి ముత్యంరెడ్డి

మెట్‌పల్లి రూరల్, మే, 23: జగిత్యాల అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్యంరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని సందర్శించి క్రీడాకారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, అన్ని రంగాల్లో రిజర్వేషన్లలో అవకావశం ఉంటుందన్నారు. చిన్ననాటి నుంచే ఆటలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గాజులీ రాందాస్, శిక్షకులు మరిపెల్లి కార్తీక్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం తడిసిన ధాన్యం





గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం, తడిసిన ధాన్యం బస్తాలు



కోటిలింగాల కమాన్ వద్ద విరిగి పడ్డ చెట్టు

గొల్లపల్లి, మే 23: గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి కురిసిన ఆకాల వర్షానికి పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ఆకాల వర్షానికి కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలు వర్షానికి తడిసి ముద్దవగా, విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం నిల్వలు వర్షానికి తడిసిపోయాయి. అకాల వర్షంతో ధాన్యం తడిసి రైతులకు వేదనను మిగిల్చగా, పలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు వర్షం నీటిలో మునిగిపోయాయి. గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం రాశుల మధ్య వర్షం నీరు చేరి రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. వరద నీటిలో ధాన్యం కొట్టుకుపోయి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. తూకం వేసిన సుమారు 15 వందల ధాన్యం బస్తాలు వర్షానికి తడిసిముద్దయ్యాయి. అలాగే వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలతో పాటు ధాన్యం నిల్వలు పాక్షికంగా తడిసిపోయి రైతులకు నష్టాన్ని మిగిల్చింది.

● **కొడిమ్యాల:** మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ప్రజలు కొంత మేరకు ఉక్కపోత నుండి ఉపశమనం పొందారు.

● గాలి వాన భీభత్సం..

వెల్గటూర్: వెల్గటూర్ మండలంలో బుధవారం రాత్రి కురిసిన గాలి వాన భీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడడంతో ప్రజలు ఒకింత ఆందోళనకు గురయ్యారు. ముఖ్యంగా ఆరుగాలం శ్రయించి పండించిన పంట ఎక్కడ తడిచిపోతుందోనని రైతులు ఆందోళన పడ్డారు. కోటిలింగాల కమాన్ వద్ద కనకదుర్గ కూల్ డ్రింక్స్ ముందు ఉన్న చెట్టు ఒక్క సారిగా విరిగి పడడంతో భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. వెల్గటూర్-జగిత్యాల రహదారిపై వెంకటాపూర్ శివారులో చెట్టు విరిగి రోడ్డుపై పడిపోయింది. విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో వెల్గటూర్ ప్రజలు చీకటిలో గడిపారు. అసలే ఉక్కపోత దీనికి తోడు విద్యుత్ సరాఫరా లేక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

చిరుతల రామాయణ నాటక ప్రదర్శన

మల్యాల, మే 23: మల్యాల మండల కేంద్రంలో భక్త మార్కండేయ నాటక కళామండలి ఆధ్వర్యంలో రెండు రోజులుగా చిరుతల రామాయణ నాటక ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. సీతారాముల కల్యాణం, అరణ్యవాసం, పాదుకాపట్టాభిషేకం, సీతాపహరణ, వాలీవధ ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. వందలాదిగా జనాలు తరలివస్తూ ప్రదర్శనలు తిలకిస్తున్నారు. కళాకారుల ప్రదర్శనలను అభినందిస్తున్నారు

కొండగట్టులో గిరిప్రదిక్షణ

మల్యాల, మే 23: చిలుకూరు శివాలయం ప్రధానర్చకులు సురేష్ ఆత్మారామ్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రతీ పౌర్ణమి రోజు నిర్వహిస్తున్న గిరిప్రదిక్షణ 14వసారి గురువారం భక్తులు నిర్వహించారు. ఈ గిరిప్రదిక్షణలో వివిధ ప్రాంతాల నుం చి వచ్చిన దాదాపు వంద మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు.

● 1000 రోజుల పాదయాత్ర

సేవ్ ఇండియన్ కల్చర్ కోసం హర్యాణకు చెందిన హార్స్ అనే వ్యక్తి తొమ్మిది నెలల క్రితం 1000రోజుల పాదయాత్ర చేపట్టగా గురువారం కొండగట్టులో భక్తులతో కలిసి గిరిప్రదిక్షణలో పాల్గొన్నా రు. ఈ సందర్భంగా తన అతను మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవడానికి తాను ఈ పాదయాత్ర చేపట్టిన్నట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి ఆధరణ లభిస్తోందని అన్నారు.

ఆవిర్భావ ఉత్సవాల్లో పాల్గొనే హక్కు సోనియా గాంధీకే ఉంది

- మోదీ ప్రధానిగా ఉంటే తెలంగాణ వచ్చేది కాదు - ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, మే 23: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల్లో పాల్గొనే హక్కు సోనియా గాంధీకి మాత్రమే ఉందని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. ఆనాడు మోదీ ప్రధాని పదవిలో ఉంటే జీవితాంతం తెలంగాణ రాష్ట్రాన్ని చూసే వాళ్ళమే కాదని అన్నారు. మోదీ లాగా కిషన్‌రెడ్డి తెలంగాణపై తమ అక్కసు వెళ్లగక్కడం సమంజసం కాదని హితవు పలికారు. మోదీ ప్రభుత్వానికి రైతు సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే దేశమంతటా ఉచిత కరెంట్, రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి బోనస్ అనే అంశం తెరపైకి రావడానికి బీజేపీ ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. పెరిగిన పెట్టుబడులను పరిగణలోకి తీసుకుని కనీస మద్దతు ధర కల్పించి ఉంటే బోనస్ సమస్య ఉత్పన్నం అయ్యేది కాదని అన్నారు. క్వింటాల్ ధాన్యానికి, మొక్కజొన్నకు మూడు రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోదీ చేయాల్సిన పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్నారని తెలిపారు. వానాకాలం సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం బోనస్, పంటల బీమా, ఏక కాలంలో రైతులకు రుణమాఫీ, రైతులకు 50 శాతం రాయితీతో విత్తనాల సరాఫరా చేయడం వంటి కార్యక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నాలుగు సంవత్సరాలకు సరిపడా ధాన్యం గోదాముల్లో నిల్వ ఉందని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియానే రాష్ట్రాలకు లేఖలు రాసిందని దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ కల్పించి ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకుందన్నారు.

పౌర సరఫరాల ద్వారా వినియోగదారులకు పంపిణీ చేస్తున్న బియ్యం 90 శాతం వినియోగించలేక పోతున్నారన్నారు. అదే సన్న రకాల సాగును ప్రోత్సహించి రేషన్ షాపుల ద్వారా వినియోగ దారులకు పంపిణీ చేస్తే 100 శాతం వినియోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీసర్పంచ్ న్యారబోయిన గంగాధర్, ఉరుమల్ల లక్ష్మారెడ్డి, గడ్డం తిరుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠన ఉచిత శిక్షణ

జగిత్యాల టౌన్, మే 23: జిల్లా కేంద్రంలోని శ్రీ అయ్యప్ప, గీతా సత్సంగం సేవా ట్రస్టుల ఆధ్వర్యంలో ఉచిత భగవద్గీత పఠన శిక్షణ తరగతులను నిర్వహించారు. మొదటి రోజు శిక్షణ తరగతులను ప్రజల నుంచి చక్కని స్పందన లభించింది. అనంతరం నిర్వాహకులు పాంపట్టి రవీందర్, గుడికందుల వెంకన్న తదితరులు మాట్లాడుతూ భగవద్గీత పఠనంపై కలిగే ఆధ్యాత్మిక చింతనపై, భక్తి భావంపై వివరించారు. కార్యక్రమంలో కోటగిరి శ్రవణ్‌కుమార్, కళ, రాము, లక్ష్మీనారాయణ, రాంచంద్రం, ధశరథ రెడ్డి, కైలాసం తదితరులు ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

జగిత్యాల టౌన్, మే 23: మూడు నెలల వేతనాలతో పాటు ఏడు నెలల పీఆర్‌సీ ఏరియర్స్ తక్షణమే చెల్లించాలని కోరుతూ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతికి చెందిన వారే అధికంగా ఉన్నామని వేతనాలు అందకపోవడంతో దయనీయ స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దినసరి ఖర్చులు కూడా లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. తక్షణమే వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు వెన్న సురేష్, నాయకులు శంకర్, రాంరెడ్డి, తిరుమల్ రెడ్డి, అనురాధ, ధనలక్ష్మి, శీరిషా, మేరి, మరియ, శైలజ, పద్మ తదితరులు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

కథలాపూర్, మే 23: మండలంలోని చింతకుంటకు చెందిన కాశవత్తుల పద్మ అనే మహిళ అనారోగ్యంతో బాధ పడుతుండగా చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిఫార్సుతో రు. 85 వేలు ఎల్‌ఓసీ అందజేశారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, కాశవత్రి వంశీ తెలిపారు. నిమ్స్ వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారని చెప్పారు. నిధులు మంజూరితో రోగికి చికిత్స అందడానికి అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు.

వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మెట్‌పల్లి, మే, 23: వివాహిత హత్య కేసులో నిందితుడు షేక్ అఫ్సర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన సంగం మమత(38)అనే వివాహితకు తన భర్త గంగాధర్‌తో నాలుగు సంవత్సరల క్రితం విడాకులు తీసుకుంది. అనంతరం కొడుకు, కూతరుతో కలిసి పట్టణంలో నిరాంనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. పట్టణంలోని సాయిరాం కాలనీకి చెందిన షేక్ అఫ్సర్‌తో మమతకు వివాహేతర సంబంధం ఏర్పడింది. షేక్ అఫ్సర్ తరుచుగా మమత ఇంటికి వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో షేక్ అఫ్సర్‌కు అతడి భార్యకు గొడవలు జరుగుతుండేవి. దీనికి కారణం మమతనే అని భావించాడు. ఈనెల 20న అఫ్సర్ భార్యతో గొడవ పడి మమత ఇంటికి రాత్రి కోపంతో వెళ్లాడు. రాత్రింతా మమత, అఫ్సర్ మధ్య గొడవ జరిగింది. అఫ్సర్ కోపంతో మమతను చున్ని, కేబుల్ వైరుతో గొంతు నులిమి, కత్తితో పొట్టలో పొడిచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో పడిపోయి ఉన్న మమతను ఇంట్లో ఉన్న కూతురు గమనించి 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలు మమత కూమారుడు సంగం గ్రహీత్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల దర్యాప్తులో మమతతో షేక్ అఫ్సర్‌కు వివాహేతర సంబంధం ఉందని, ఆమె మృతికి అఫ్సర్ కారకుడని తేలింది. గురువారం షేక్ అఫ్సర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. హత్య కేసును ఛేదించిన సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి, సిబ్బందిని డీఎస్పీ అభినం దించారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

కోరుట్ల, మే 23: పట్టణంలోని ఎసీకోనిగుట్ట ప్రాంతానికి చెందిన సయ్యద్ అజ్మత్ (31) అనే యువకుడు అత్మహత్య చేసుకున్నాడు. సయ్యద్ అజ్మత్ బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్యాన్‌కు ఉరివేసుకొని అత్మహత్య చేసుకోగా గమనించిన కుటుంబ సభ్యులు ఉరి నుంచి దించి పట్టణంలోని ఓ ఆసుపత్రికి తరలించారు.

అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో బంధువులు మృత దేహాన్ని ఇంటికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. అజ్మత్ బార్య రోహిణీ బేగం మృతిపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం రిపోర్ట్ తర్వాత అసలు విషయం బయటకు రానున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టుదలతోనే లక్ష్య సాధన సాధ్యం

జగిత్యాల టౌన్, మే 23: పట్టుదలతో చదివితేనే లక్ష్య సాధన సాధ్యమవుతుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జగిత్యాల పట్టణంలోని నవ్య బాలికల కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన సరిగల్ల శ్రీయ అనే విద్యార్థిని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఈఏపీ సెట్ ఫలితాల్లో 2,009 ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ర్యాంక్ సాధించిన విద్యార్థినిని మున్సిపల్ ఛైర్ పర్సన్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్ కుమార్ తదితరులు ఉన్నారు.

బెదిరించి డబ్బులు వసూలు

● ఇద్దరిపై కేసు

మల్యాల, మే 23: కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనా నికి వచ్చిన వారిని బెదిరించి వారి వద్ద డబ్బులు వసూ లు చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుమా రస్వామి గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నా యి. మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన దూమాల రజిత తన బావ అంతడ్పుల కరుణాకర్‌తో కలిసి కొండగట్టుకు వచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం తిరిగివెళుతూ దిగువ కొండగట్టు శివారులో కారు పక్కకు నిలిపి ప్రసాదం తింటుండగా దరూర్‌కు చెందిన వెంకటేష్, సారంగపూర్‌కు చెందిన చంద్రశేకర్ వారి వద్దకు వచ్చి బెదిరించి వారి వద్ద గల ఎనిమిది వేల రూపాయలను బలవంతంగా వసూలు చేశారు. దీంతో రజిత తల్లి చిట్యాల లక్ష్మీ మల్యాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- ఆలయాలకు తరలివచ్చిన భక్తులు
- కన్నుల పండువగా స్వామివారల కల్యాణోత్సవం
- ప్రత్యేక పూజలు







స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పెగడపల్లిలో లక్ష్మినర్సింహా స్వామి కల్యాణోత్సవం, దుంపెటలో స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

జిల్లాలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. రాయికల్‌లో వేంకటేశ్వరస్వామివారి కల్యాణం, పెగడపల్లి, కథలాపూర్ మండలాల్లో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

రాయికల్, మే 23: మండలంలోని భూపతిపూర్‌లో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకుల తిరునగిరి వెంకట గోవింద రాజస్వామి ఆధ్వర్యంలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శుక్రవారం జాతర, అన్నదానం, స్వామివారి రథోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇటిక్యాల అర్చకులు రామకృష్ణ, తాజా మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ యాచమనేని మహేశ్వర్ రావు, కామని లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

● లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

పెగడపల్లి: పెగడపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి మరియు లక్ష్మీనర్సింహాస్వామి జయంత్యుత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు గంగుల కొమురెల్లి-లక్ష్మి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, అన్నదాత గంగుల కొమురెల్లి, కమిటీ సభ్యుల, లలితా పారాయణం సభ్యులు పాల్గొన్నారు.

● లక్ష్మీనరసింహస్వామి జాతర

కథలాపూర్: మండలంలోని దుంపెటలో గురువారం శ్రీలక్ష్మీనరసింహ స్వామి జాతర ఘనంగా జరిగింది. నాలుగు రోజులుగా బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న క్రమంలో కొండపై కొలువైన స్వామివారి దర్శనం కోసం భక్తజనం ఉదయం నుంచే బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో జాతర సందడిగా సాగింది. మహిళలు ఉపవాసాలతో స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్నారు. పండితులు వామనశర్మ నేతృత్వంలో అభిషేకాలు, అర్చనలు చేశారు. నిర్వాహకులు భక్తుల కోసం అన్నదానం చేశారు. కాగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకోగా గ్రామస్తులు శాలువాతో సత్కరించారు.

● వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందాంబ కల్యాణం

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో గోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వార్షికోత్సవాలు నిర్వహిస్తుండగా గురువారం కళ్యాణం ఘనంగా జరిగింది. చుట్టు పక్కన గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో చీర్లవంచ మధు, బండెడ్ల విష్ణు, రాజేశం, భక్తులు పాల్గొన్నారు.

● ఘనంగా గీతా యజ్ఞం

ధర్మపురి: ధర్మపురి మండలంలోని తీగలధర్మారంలో గీతా యజ్ఞం కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణ గీతాశ్రమ 44వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లోక క్షేమార్థం ఏటా నిర్వహించే విధంగా గీతా ఆశ్రమ అధ్యక్షులు వేముల రాజరెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జగిత్యాల గాయత్రి పరివార్‌కు చెందిన యజ్ఞ నిర్వాహకులు వేముల రాంరెడ్డి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఉదయం శ్రీ కృష్ణ భగవానుడికి అభిషేకం, ధర్మ ధ్వజారోహణం, తులసీ పూజ, గోపూజ నిర్వహించారు. అత్యంత భక్తి శ్రద్దలతో ఐదు కుండీలతో (పంచ కుండీయ) గీతా హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి జరిపి 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. ప్రముఖ గీతా ప్రచారక్ వేముల రాంరెడ్డి భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అయిల్నేని ఆండాళు-ప్రభాకర్‌రావు, మాజీ ఉపసర్పంచ్ పందిరి అశోక్, మాజీ సర్పంచులు జంగిలి ప్రభాకర్, పందిరి తిరుపతి, గందం రమేష్, పత్తిపాక తిరుపతి, మదుకర్, రాయమల్లు, మల్లేశం, సుధాకర్‌రెడ్డి, ధర్మపురి, బీర్‌పూర్ మండలాలకు చెందిన గీతా భక్తులు పాల్గొన్నారు.



తీగలధర్మారంలో గీతా యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు